## రాష్ట్రస్థాయి పోటీలకు సింగూరు గురుకుల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**పుల్కల్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఖో-ఖో రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని సింగూరు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర మైన సంగారెడ్డిలో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఖో-ఖో క్రీడాకరుల సెలక్షన్ అండర్ 18 విభాగంలో సింగూరు గురుకుల పాఠశాల విద్యార్థులు రాహుల్, హరీష్, శివబాబు, సిద్ధార్థలు ఎంపికయినట్లు పాం శాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, పీడీ, పిఈటీ, ఉపాధ్యాయులు ప్రత్యేంగా అభినందించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆశీర్వదించి శుభాకాంక్షలు అందచేశారు.




## నేడు ఛలో డైరెక్టరేట్ : టిపిటిఎఫ్ జిల్లా కమిటీ పిలుపు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** టిపిటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న మూడవ దశ కార్యక్రమం ఛలో డైరెక్టర్‌ను జయప్రదం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ లు పిలుపునిచ్చారు. కెవిజిబి పాఠశాలల స్థాయిలో నవంబర్ 15, 16 తేదీల్లో మొదటి విడత నిరసన, రెండవ దశ నవంబర్ 26 నాడు కలెక్టరేట్ వద్ద నిరసన నిర్వహించామన్నారు. అయినను ప్రభుత్వం ఏ మాత్రం పట్టినట్లు వ్యవహరిస్తున్న తీరు దురహంకారానికి నిదర్శనమని అన్నారు. మూడవ దశ కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 3న నిర్వహించే ఛలో డైరెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో కెజిబివి ఉద్యోగినిలు, టిపిటిఎఫ్ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని వారు కోరారు. కాంట్రాక్టు విధానం రద్దు చేయ్యాలని, కెజిబివి టీచర్లను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, గురుకుల విద్యా విధానంలో ఉన్న స్టాఫ్ ప్యాట్రాన్, క్యాడరైజేశన్, వేతన స్కేలను వర్తింప చేయాలి, రాత్రి పుల విధులకు స్వస్తి చెప్పి, మ్యాట్రిన్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

## గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచండి

### కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**హుస్నాబాద్, డిసెంబరు2, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున సిద్దిపేటలోని సమీకృత జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో ప్రాజెక్టు నిర్మాణ పనులపై హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, పోలీస్ కమిషనర్ శ్వేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును ఒక సదుద్దేశంతో మొదలు పెట్టారని, అలాంటి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి లక్ష్యాన్ని చేరేలా నిర్మాణం చేయాలన్నాంమరు. మంత్రి హరీష్‌రావు సూచనల మేరకు పనుల్లో నాణ్యత పాటించాలని, అదనపు టిఎంసికి సంబంధించి నిర్వాసితులకు అందాల్సిన పూర్తి పరిహారం పై ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ నిర్వాసితులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారంతో పాటు ఇతర నష్టపరిహారాలను వీలైనంత త్వరగా అందేలా మంత్రి, ముఖ్యమంత్రిల దృష్టికి తీసుకెల్లి పరిష్కరిస్తామన్నారు. పనులు జరిగే ప్రదేశంలో ఎప్పటికప్పుడు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్, రెవెన్యూ, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు, పిల్లల రక్షణకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి

### సీపీ ఎన్.శ్వేత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీపీ శ్వేత

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** చిన్న చిన్న సమస్యలు నివృత్తి చేసు కోవడానికి అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని సీపీ ఎన్.శ్వేత అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు, మహిళా సిబ్బందికి, స్టేషన్ రైటర్లకు, భరోసా సెంటర్ సిబ్బందికి మహిళలు, పిల్లల రక్షణకు ఉన్న చట్టాలపై తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణకు ఎల్లవేళాల అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. దరఖాస్తు రాగానే సత్వరమే స్పందించాలన్నారు. మహిళల, పిల్లల రక్షణకు పెద్ద పీట వేయాలన్నారు. ఫోక్స్, అత్యాచార కేసులలో నేరుస్తులకు శిక్షలు పడే విధంగా పరిశోధన ఉండాలన్నారు. భరోసా, సఖి, చైల్డ్ ప్రొటెక్షన్, డిస్టిక్ వెల్ఫేర్, సిడబ్ల్యుసి, చైల్డ్‌లైన్ డిఅర్బీ తదితరల అధికారులు, సిబ్బందితో మహిళలు, బాలల రక్షణ కోసం సమన్వయంతో విధులు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. రాష్ట్ర భరోసా సెంటర్ టెక్నికల్ డైరెక్టర్ మమతా రఘువీర్, హైదారాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ ఎస్పీ అశోక్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సీఐ దుర్గ, సైదానాయక్, జిల్లాలోని మహళా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి

### బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఓదెల మాణిక్‌రావు



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**సదాశివపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ అధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఓదెల మాణిక్‌రావు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 4వేల మంది అర్హులైన నిరుపేదలు డబుల్ బెడ్‌రూమ్‌ల కొరకు దరఖాస్తు చేసుకుంటే కేవలం టిఆర్‌ఎస్ అనుకూలమైన వాళ్లకు కొందరికి ఇచ్చి మిగతా నిరుపేదలు కానేకాదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అందరి దరఖాస్తులను పరిశీలించి అందులో నిజమైన నిరుపేదలకు అందరికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు కోరుతున్నామన్నారు. విలేఖరులకు ప్రత్యేకంగా ఇస్తానన్న డబుల్ బెడ్‌రూమ్‌లను గుర్తింపు పొందిన ప్రతి విలేఖరికి ఆవ్వాలని డిమాండ్ చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఖర్చులు కేంద్ర ప్రభుత్వం 60శాతం బరిస్తున్నందున ఈ పథకం ప్రకటనపై మోడీ చిత్రపటాన్ని ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లను అమ్ముకుంటుందరి టిఆర్‌ఎస్ కింది స్థాయి నాయకులు డబుల్ బెడ్‌రూమ్ పొందిన వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఈ తతంగం నడుస్తుందని డబుల్ బెడ్‌రూమ్ వండ్ల పంపక పథకాన్ని టిఆర్‌ఎస్ నాయకులు పైసా వసూలు పథకంగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా గీత సెల్ కన్వీనర్ కృష్ణ, బిజెపి జిల్లా నాయకులు శ్రీకాంత్‌రాజ్, పట్టణ కార్యదర్శులు భవానీప్రసాద్‌యాదవ్, శ్రీశైలం, కిసాన్ మోర్చ అధ్యక్షులు శివలింగం, దళిత మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్, పట్టణ నాయకులు జగత్‌కృష్ణ, అంజి, లక్ష్మికాంత్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి

### మైనర్ కాల్వల ద్వారా నీళ్లు చేరవేయడమే లక్ష్యంగా పని చేద్దాం : మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రతి ఊరికి ప్రతి చెరువుకు కాల్వలు..మైనర్ కాల్వల ద్వారా నీళ్ల చేరవేయడమే లక్ష్యంగా పని చేద్దామని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మల్లన్న, రంగనాయకసాగర్ జలాశయం ద్వారా కాల్వలు, మైనర్ కాల్వల పనుల పురోభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మైనర్ ఇరిగేషన్ కాల్వ భూసేకరణ త్వరగా చేపట్టి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను అదేశించారు. నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలంలోని చెక్ డ్యాంల, కాజ్ వే నిర్మాణం పనులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మల్లన్నసాగర్ 1 అర్ కాలువ అయకట్టు 21000 ఎకరాల పనులలో వేగం పెంచాలని అధికారులను అదేశించారు. మల్లన్నసాగర్ 1 అర్ పరిధి గ్రామాలైన బండారుపల్లి, తడ్కపల్లి, పొన్నాల, ఎన్సాన్‌పల్లి, సిద్దిపేట, నాంచారుపల్లి, బక్రిచెప్యాల, వెల్కటూర్, బాషగూడెం, మిట్టపల్లి, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, బందారం, మర్పడగ మీదుగా వెళ్లే కాల్వ భూసేకరణ, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రంగనాయకసాగర్ ఎల్ ఎంసి అర్ 8 కాలువ వాగు క్రాసింగ్ బ్రిడ్జి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అర్‌బి కాలువ ద్వారా మాటిండ్ల గ్రామం వరకు నీళ్లు ఇవ్వాలన్నారు. రంగనాయకసాగర్ ఎల్‌ఎంసి అర్ 3, అర్ఎం 2 ఎస్ఎంఎస్ కాలువ పనులు, భూ సేకరణ త్వరగా పూరి చేసి మైలారం, కమ్మర్లపల్లి, చౌడారం, అల్లీపూర్ గ్రామాలకు వెంటనే నీళ్లు ఇవ్వాలన్నారు. ఘణపూర్, అక్కనపల్లి, గట్లమల్యాల గ్రామాలకు వాగు మీద జరుగుతున్న లిఫ్ట్ పనులు పూర్వ చేసి నీళ్లు ఇవ్వాలన్నారు. మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని మంత్రి అదేశించారు. కొత్త సభ్యులకు ప్రభుత్వ పథకాలతో పాటు సబ్సిడి రుణాలు, బీమా సౌకర్యం లభిస్తుందని గంగాపుత్రులు, ముదిరాజ్‌లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమీక్ష సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, అర్డీఓ అనంతరెడ్డి, ఇరిగేషన్ ఈఈ సాయిబాబా, ఈడీ, ఎఈఈ ఖాజా, అమరజీవి తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల లబ్దిదారులకు చెక్కుల పంపిణీ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూరు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 75 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

### భూ నిర్వాసితుల త్యాగం మరువలేనిది

అంతగిరి రిజర్వాయర్ నిర్వాసితులైన కొచ్చగుట్టపల్లి వాసుల త్యాగం మరువలేనిదని ఎంత చేసినా వారి రుణం తీర్చలేనిదని మంత్రి హరీష్‌రావు అన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో 18 యేండ్లు నిండిన అర్హులైన లబ్దిదారులు 35 మంది పునరావాస కాలనీలోని 59 మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మాణిక్యరెడ్డి, వైస్ ఎంపిపి కీసర పాపయ్య, టిఅర్ఎస్ నాయకలు వేలేటీ రాధాకృష్ణశర్మ, కాముని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ల్యాప్ టాప్‌ల పంపిణీ

నియోజకవర్గ పరిధిలోని సిద్దిపేట పట్టణం, ఇర్కోడు, నారాయణరావుపేట, చిన్నకోడూరు, నంగునూర్, బెజ్జంకిలకు చెందిన 6 మంది దివ్యాంగులకు తానా సహకారంతో బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, ల్యాప్ టాప్‌లను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే నారాయణరావుపేట, జక్కాపూర్ పాఠశాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఇతర గ్రామాల్లో చదివే విద్యార్థినీలకు సైకిళ్లు పంపిణీ చేశారు.

### ఎల్అండ్ టీ నైపుణ్య శిక్షణ సంస్థ ప్రారంభం

జిల్లా కేంద్రంలోని కెసిఆర్ నగర్‌లో ప్రభుత్వ సహకారంతో ఎల్అండ్ టీ సంస్థ నిర్వహిస్తున్న నిర్మాణ నైపుణ్య శిక్షణ సంస్థను మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. రూ.5 కోట్లతో సిద్దిపేటలోనే తొలిసారిగా ఎల్అండ్ టీ సంస్థ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు కోసం శని,ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు

### యువత సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ హరీష్

**మెదక్ అర్బన్, డిసెంబర్2 ప్రభాతవార్త:** శని, ఆదివారాల్లో జిల్లాలోని 576 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ ఎస్. హరీష్ యువతకు సూచించారు. ఓటు ఎంతో విలువైందని, శక్తివంతమైందని, ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు ఆయుధమని అన్నారు. కాబట్టి 1 జనవరి 2023 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకోవలసిందిగా శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రతి బూతు స్థాయి అధికారి వద్ద ఓటరు నమోదు ఫారం-6, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానానికి ఫారం-6బీ, ఓటరు జాబితాలో పేరు ప్రతిపాదిత పేరును మార్చడం, తొలగించడానికి, అభ్యంతరాలకు ఫారం-7, నివాస మార్పు, నమోదుల సవరణ కోసం ఫారం-8 అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు, క్యాంపస్ అంబాసిడర్లు, సూపర్‌వైజరి అధికారుల ద్వారా ఓటరు నమోదుపై పాఠశాల, కళాశాల స్థాయిలో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక శిబిరాలతో కలుపుకొని గత నెల 9 నుండి 30 వరకు 1,507 మంది కొత్తగా ఓటర్లుగా దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. 1 జనంరి 2022న ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పుడే జిల్లాలో 6,14,464 మంది ఓటర్లు ఉండగా నవంబర్ 9న డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి 6,18,532 మంది ఓటర్లు ఉన్నారని, అనగా 4,068 మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారని కలెక్టర్ వివరించారు. కాగా వచ్చే జనవరి నాటికి జిల్లాలో 18-19 సంవత్సరాలలోపు యువత 12 వేలకు పైగా ఉంటారని అంచనా అని, వారినందరిని గుర్తించి ఓటరుగా నమోదు చేయడం మన బాధ్యతని అన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న శిబిరాన్ని కూడా సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు. 17 సంవత్సరాలు పైబడిన వారు కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఫారం-6 నింపి బూతు స్థాయి అధికారికి లేదా ఏఈఆర్‌వో లేదా ఏఆర్‌వోలకు అందించడం ద్వారా లేదా చరవాణిలో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గానీ ఎన్‌వీఎస్‌పీ.ఇన్ లేదా ఓటర్‌పోర్టల్.ఈసీఐ.జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా గానీ ఓటరుగా సులువుగా నమోదు చేసుకోవచ్చని ఆయన యువతకు సూచించారు. ఈ నెల 8 వరకు కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం ఉందన్నారు. అంతేగాక ఇప్పుడు ఎన్నికల కమీషన్ ఏడాదిలో నాలుగు పర్యాయాలు అనగా జనవరి1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. ఓటరు నమోదు కోసం పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురించి ముందస్తుగా గ్రామాలలో చాటింపు వేయాలని, అలాగే సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక శిబిరం అనంతరం బూతు స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులను, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగులకు గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం చేశామని, వంద శాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది

### మంత్రి తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రీయ బాలల ఇన్ స్పైర్- వైజ్ఞానిక జిల్లా ప్రదర్శనను అయన శుక్రవారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి తిలకించి చిట్టి మెదడు.. గట్టి పదును పెట్టిందని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు కాకముందు 8 యేండ్ల క్రితం విద్యా రంగానికి 9 వేల కోట్ల నిధులు వెచ్చిస్తే..రాష్ట్రం ఏర్పడిన త్వరాత ప్రతి యేటా సర్కారు రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌ను రద్దు చేసిందని..రాష్ట్ర ప్రభుత్వం మోడల్ స్కూల్స్ బాధ్యత తీసుకొని విద్యపై బడ్జెట్‌లో 10 శాతం నిధులు వినియోగిస్తుందన్నారు.

మన ఊరు మన బడి కార్యక్రమంలో 7 వేల కోట్లు కేటాయించి బడుల అధునీకరణకు ప్రభుత్వం కృషి చేస్తుం దన్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థినీ లకు యేడాది వరకూ హెల్త్ హాజనిక్ కిట్స్, శానిటరీ కిట్స్ రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థినీలకు ప్రయోజనం చేకూరేలా మరో 20 రోజులలో ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే పదో తరగతి ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలువడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు కునే విద్యార్థులకు పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేలా స్వచ్ఛబడి విజిట్ చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు, వైజ్ఞానికి ప్రదర్శన నిర్వహకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్ర తినిధులు, టిఅర్ఎస్ నాయకులు కడవెర్గు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పూజల చిన్న, కొండం సంపత్‌రెడ్డి, గంప రామచంద్రరావు, పాలసాయిరాం, సాకి అనంద్, అదారుపల్లి శశిధర్‌శర్మ, మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, అస లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, భగవతయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు. తదితరులు పాల్గొన్నారు.

### చండీ యాగంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి దంపతులు

లోక కల్యాణం కోసం చేపట్టిన ఈ మహారుద్ర హోమంతో రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందేలా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో అత్యద్భుతంగా చండీ యాగం జరిగిందని రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వేములవాడ కమాన్ సమీపంలోని మైదానంలో గత 15 రోజులుగా శ్రీశ్రీశ్రీ కృష్ణ స్వరూప నంద స్వామి అధ్వర్యంలో కాలచక్ర అయుత చండీ మహారుద్ర యాగం చివరి రోజు నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సిద్దిపేటలో 165 అడుగుల పాలరాతి రాధాకృష్ణ విగ్రహంతో కూడిన మందిరాన్ని నిర్మిస్తామని ఫిబ్రవరిలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలందరూ అయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు, సుఖ:సంతోషాలు ప్రసాదించేలా స్వామి వారిని కోరినట్లు అయన వివరించారు. అయన వెంట ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టిఅర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి దంపతులు, మల్లన్న అలయ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ నాయిని చంద్రం, టిఅర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పూజల చిన్న, మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన ఇగ్నైట్ ఫెస్ట్ పోటీలు

### సృజనాత్మకతను చాటిన గిరిజన విద్యార్థులు

**నర్సాపూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** నర్సాపూర్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నర్సాపూర్ గిరిజన సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో నిర్వహించిన ఇగ్నైట్ ఫెస్ట్ 2022 పోటీలు శుక్రవారం ముగిశాయి. మెదక్ , కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని 10 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ,జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు ఈపోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ముగింపు వేడుకల్లో ఆ సంస్థ డిప్యూటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి నర్సాపూర్ మున్సిపల్ కమీషనర్ వెంకట్ గోపాల్, రీజినల్ కోఆర్డి నేటర్ సంపత్‌కుమార్, గురుకుల అధికారులు , శ్రీనివాస్‌కుమార్, కోటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ బిక్షమయ్య లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. వివిద విబాగాల్లో 29 స్థానాల్లో ప్రతిభ కనబరిచిన ఇందల్వాయి గురుకుల పాఠశాల విద్యార్థులు రీజినల్ లేవల్ టాపర్ లుగానిలిచారు. రెండవ స్థానంలో నాగిరెడ్డిపేట విద్యార్తులు 26 పథకాలతో నిలిచారు.

### విద్యార్థుల ప్రతిభకు పట్టం
### ఉప కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

విధ్యార్థుల్లోదాగిఉన్న ప్రతిభను ఈపోటీల ద్వార వెలికి తీస్తున్నామన్నారు. వారిని అన్ని విబాగాల్లో నిష్ణాతుల్లా తయారు చేసేందకు ప్రణాళిక బద్దంగా కార్యచరణ రూపొందించామని తెలిపారు. గత ఆరేళ్ళుగా ఇదే తరహాలో ఈపోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. కరోనా కారణంగా గత సంవత్సరం ఈ పోటీలు నిర్వహించలేకపోయామని తెలిపారు. ఓఎస్‌డి శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ విధ్యార్థులను వెన్నుతట్టి ప్రొత్సహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఆటల పోటీలతో పాటు విధ్యా, సమాజం, సైన్స్ అనే ఆంశాలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని అన్నారు. గత రెండు రోజులుగా నర్సాపూర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన ఇగ్నైట్ ఫెస్ట్ విజయవతంగా ముగిసింది. ఈ పోటీల్లో మూడు జిల్లాకు చెందిన 800 మంది విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ఇగ్నైట్ పెస్ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో అధికారులు

### 3, 4 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో

# ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో డిసెంబర్ 3,4 తేదీలలో ప్రత్యేక ఓటరు, నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొనే విధంగా చూడాలన్నారు. ట్రాన్స్ జెండర్స్, సెక్స్‌వర్కర్లు, దివ్యాంగులు అందరూ ఓటర్‌గా నమోదు అయ్యేలా, ఓటు విలువ గురించి అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. యువత అర్హులైన వారు ఈ నెల 3, 4 తేదీలలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను వినియోగించుకుని ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. బూత్ లెవెల్ అధికారుల వద్ద/పోలింగ్ కేంద్రాలలో ఓటరు జాబితాలో తమపేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, పాత ఓటర్ కార్డ్ కలిగి ఉన్న వారు కూడా మరొకసారి తమపేరును జాబితాలో సరి చేసుకోవాలని, మార్పులు, చేర్పులు సవరణలు ఉంటే వెంటనే ఫారం-8లో దరఖాస్తు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంటర్లు, పంచాయతీ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాల సభ్యులు సహాయంతో గ్రామంలో క్రొత్తగా వచ్చిన వారిని, అర్హత ఉండి ఓటర్‌గా నమోదు చేసుకోని వారిని గుర్తించి, ఓటర్ కార్డ్ కొరకు పేర్లను నమోదు చేసేలా బిఎల్ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ 3, 4 రెండు రోజుల్లో అర్హత ఉన్న వారందరూ ఓటర్‌గా నమోదు కావాలని కలెక్టర్ కోరారు.



మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

## మంత్రికి, డిప్యూటీ స్పీకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

**కొమురవెల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ఈనెల 18న జరిగే శ్రీమల్లికార్జునస్వామి వారి కళ్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌లకు శుక్రవారం హైదారాబాద్‌లో ఆలయ ఈఓ బాలాజీ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట దేవాలయం ధర్మకర్తలు నామి రెడ్డి సౌజన్య, బుచ్చిరెడ్డి, సింది లింగం, సాయియాదవ్, అర్చకులు పడిగన్నగారి అంజనేయులు, పడిగన్నగారి మల్లేశం, మహాదేవుని భాస్కర్, మహాదేవుని మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకుల పనితీరు భేష్



కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలిస్తున్నతీరును పరిశీలిస్తున్న తహసీల్దార్

**బెజ్జంకి, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకుల పని తీరు అభినందనీయమని తహసీల్దార్ విజయప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం చీలాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహకులు కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా సహకారం అందించిన సర్పంచ్ రాగుల మొండయ్యను అభినందించారు. కొనుగోలు కేంద్రంలో పూర్తిగా 8 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేశారని తెలిపారు. జిల్లాలోనే పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన కేంద్రం చీలాపూర్ గ్రామమేనని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం సారయ్య, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం మండల కార్యవర్గం



మత్స్యసహకార అక్కన్నపేట మండల కార్యవర్గం

**అక్కన్నపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త :** మత్స్య శాఖ సహకార సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం మండలంలోని 11 మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పెండల ఐలయ్య, అధ్యక్షుడిగా గంగదరి రాజయ్య, ఉపాధ్యక్షునిగా చింతల బాల్‌రాజు, కార్యదర్శిగా చొక్కం గణేష్, కోశాధికారిగా బొడిగె రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, ఎదల వనేష్, వెంకటయ్య, కొమురయ్య, లింగయ్య, సమ్మయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయం

**-మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి**



ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న అయిలేని అనితశ్రీనివాసరెడ్డి

**హుస్నాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** పేదలకు సొంత స్థలాల్లో గృహ నిర్మాణం చేసుకునేలా మూడు లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్నట్లు హుస్నాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని నాలుగో వార్డులోని ప్రజలకు ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పేదవారిని అక్కున చేర్చుకునేలా వారి కన్నకలలను సాకారం చేసుకునేందుకు ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై అందిరికి అవగాహన కల్పిస్తున్నామన్నామని అనిత శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజలు సొంత స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అక్కడి ప్రజలకు సూచించారు. ఈ సాయం మూడు దఫాలుగా ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు.

## రేవంత్‌రెడ్డిని కలిసిన జశ్వంత్‌రెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** టిపిసిసి డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి శుక్రవారం టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాదాడి జశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పరిస్థితులు రేవంత్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాహుల్‌గాంధీ జోడో యాత్రకు సంఘీభావంగా నిర్వహించిన పాదయాత్ర బాగుందని, గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి పెట్టింది పేరని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని, పార్టీ శ్రేణులు అంతా కష్టపడి పార్టీకి పనిచేయాలని రేవంత్‌రెడ్డి తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట దుబ్బాక నియోజకవర్గ సీనియర్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ కొండపాక విజయ్, నరేందర్‌రెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు అజ్గర్, నర్సంపల్లి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంజాల రవిగౌడ్, పృథ్వీరాజ్, మంద కొమురయ్య, యేశం నాగరాజు, సుదర్శన్, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో జశ్వంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



కెసిఆర్, హరీష్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నేతలు



గజ్వేల్‌లో కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘం నేతలు

# సిఎంకు, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** హైదారాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అదేశాలు జారీ చేయడం గౌడ జాతి హర్షిస్తుందని తెలంగాణ గౌడ సంఘం, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పల్లె బాలకిషన్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాపన్నగౌడ్ చౌరస్తాలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయనుండడంతో గౌడ సమాజం అభినందిస్తుందన్నారు.

కార్యక్రమంలో గౌడసంఘం సిద్దిపేట అధ్యక్షులు గాదగోని ప్రకాష్, గాదగోని కిష్టయ్య, గడ్డమీది యాదగిరి, తాడూరి ధీరజ్, బాలగోని సంతోష్, అన్నగోని నారాయణ, పల్లె వెంకట్,బొల్లం శివలింగం, రామంచ మల్లేశం, గుర్రం బాలరాజు, గాదగోని సత్యం, రాజేశం, బత్తిని శంకర్, అ ఒబటి ప్రకాష్, పల్లె లాలు, పల్లె హేమేందర్, ముంద్రాతి శంకర్, గాదగోని హరి, మహేష్, రదం ప్రశాంత్, మాచర్ల లక్ష్మణ్, వడ్లకొండ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**గజ్వేల్‌లో...**

**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించడానికి ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని గజ్వేల్ గౌడ సంఘం అధ్యక్షుడు లింగంగారి రాజాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడానికి ఉత్తర్వులు జారీ చేసినందుకు గౌడ కులస్తులు సిఎం కెసిఆర్ వెంటే ఉంటారన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సమన్వయ కమిటి రాష్ట్ర కో-కన్వీనర్ అంబటి బాల్‌చందర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జెడ్‌పిటిసి పంగ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, వైస్ ఎంపిపి కృష్ణాగౌడ్, కౌన్సిలర్ శ్రీధర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, కల్యాణ్‌కార్ నర్సింగరావు, పంజాల గణేష్‌గౌడ్, పంజాల రాజ మల్లుగౌడ్, ఎ.మల్లేశంగౌడ్, నక్క రేగొండగౌడ్, జంగం బలరాంగౌడ్, నక్క రాములు గౌడ్, అశోక్‌గౌడ్, రాజాగౌడ్, జంగం లింగంగౌడ్, వెంకట్‌గౌడ్, ఆప్కారి సుధాకర్‌గౌడ్, కానుగంటి సత్యనారాయణ, చంద్రంగౌడ్, నక్క రమేష్‌గౌడ్, టిఆర్ఎస్‌కెవి తొగుట మండల అధ్యక్షుడు కీసర నరేష్‌గౌడ్, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

**మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**

**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మండల వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగచైతన్య స్మారక ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగచైతన్య స్మారక వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. గజ్వేల్ ప్రాంతానికి వాలీబాల్ క్రీడల్లో జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన ఘనత నాగచైతన్యకు దక్కిందని, యువత క్రీడల్లో రాణించి మంచి పేరు సంపాదించాలన్నారు. వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు రాజు, కనకయ్య, వెంకటేష్, సంతోష్, స్వామి, అరుణ్, తెరాస నాయకులు కొమురవెల్లి ప్రవీణ్, కన్నాయాదవ్, హౌసింగ్ బోర్డు నాయకులు వాసు, జయసింహారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముత్యంరెడ్డిని కలిసిన ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి



ఊడెం కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న గడా అధికారి ముత్యంరెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఊడెం కృష్ణారెడ్డి శుక్రవారం ఐఓసి కార్యాలయంలో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గడా అధికారి ముత్యంరెడ్డి కృష్ణారెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనను ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు సిఎం కెసిఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేషం, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ నిర్మాణం చేయడం అభినందనీయం

**నర్సాపూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** నర్సాపూర్ హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కన అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నేత, అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్‌స్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్ రాంచందర్, నాయకులు బిక్షపతి, ఆంజనేయులుగౌడ్, నాగేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జ్ఞానేశ్వర్‌గుప్త, సాగర్, టిఆర్ఎస్ నాయకులు ఇబ్రాహీంఖాన్, నరేందర్‌రెడ్డి, కమ్మరి నాగేశ్, కృపాచారి, రాకేశ్‌గౌడ్,అస్లామ్, భూషణం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బిజెపి నాయకులు

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి నేతల ధర్నా

**వర్గల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** బిజెవైఎం నేతలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, బిజెవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్‌యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో జారీచేసిన నోటిఫికేషన్లకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం ఉపాధ్యక్షుడు మహేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కిచ్చుగారి పాండు, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి దిండి నాగరాజు, వర్గల్, నెంటూర్ బూత్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, ప్రవీణ్‌యాదవ్, సాయియాదవ్, బన్నిరెడ్డి, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

## భరోసా సెంటర్‌లో సత్వర సేవలు



భరోసా సెంటర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ అవరణలో నిర్మిస్తున్న నూతన భరోసా సెంటర్‌ను రాష్ట్ర భరోసా సెంటర్ టెక్నికల్ డైరెక్టర్ మమతా రఘువీర్, హైదారాబాద్ ఉమెన్స్ సేఫ్టింగ్ అడిషనల్ ఎస్పీ అశోక్‌లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. అనంతరం సిద్దిపేట భరోసా సెంటర్‌ను సందర్శించి భరోసా సెంటర్ ద్వారా చేసిన సహాయ సహకారాలు, ఇన్వెస్టిగేషన్ చేసిన కేసులను అడిగి తెలుసుకున్నారు. భరోసా సెంటర్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు సంతృప్తిగా ఉన్నాయని వారు సిబ్బందిని అభినందించారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పించడంతో పాటు భరోసా కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. భరోసా సెంటర్‌లో సత్వర సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఫోక్స్, అత్యాచార కేసుల్లో బాధితులకు త్వరగా కాంపెన్సేషన్ ఇప్పించడానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఏ.బీ.దుర్గ, సిబ్బంది సౌమ్య, సోని, హరిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

## ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**పాపన్నపేట, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో కొత్తగా నిర్మించిన యస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌ను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు శుభకార్యాక్రమాలు జరుపుకునేందుకు పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఖర్చు, సమయం భావంతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఫంక్షన్ హాల్‌లను నిర్మిస్తుండటంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనునరాధ ఏడుకొండలు, పాపన్నపేట మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు బాపారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం : ఎమ్మెల్యే రఘునందన్‌రావు

**దుబ్బాక, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని బిజెపి సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ అంజన్‌కుమార్‌గౌడ్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన బిజెపి నియోజకవర్గ శక్తి కేంద్రాల ప్రముఖుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యకర్తల బలంతోనే ఈ రోజు బిజెపి పార్టీ అధికారంలో కొనసాగుతుందన్నారు. కార్యకర్తల కృషి వలనే ప్రపంచంలో అత్యధిక సభ్యత్వమున్న పార్టీగా బిజెపి చరిత్రలో నిలిచి పోయిందన్నారు. సంస్థ గతంగా బూత్ స్థాయిలో మరింత బలోపేతమై రానున్న స్థానిక సంస్థ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరడం ఖాయమన్నారు. టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అవినీతి, అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యకర్తలు పార్టీకి బలం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, బిజెపి మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ చింతల సంతోస్ కుమార్ గుప్త, నియోజక వర్గ కన్వీనర్ ఎస్ఎన్ చారి, సిద్దిపేట ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య, కౌన్సిలర్ మల్లా రెడ్డి, సర్పంచులు, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునంధన్ రావు



క్రీడాకారుడికి సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే వొడితతల సతీష్‌కుమార్

## సైక్లింగ్‌లో తెలంగాణ సత్తా చాటాలి : ఎమ్మెల్యే

**హుస్నాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలో తెలంగాణ సత్తాచాటాలని ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన క్రీడాకారుడు బల్లు నిఖిల్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాగా అతడు పేద కుటుంబానికి చెందడంతో ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన సతీష్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్పోర్ట్స్ సైకిల్‌ను శుక్రవారం సిద్దిపేటలో అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,పోలీస్ కమిషనర్ శ్వేత,అడిషనల్ కలెక్టర్,క్రీడాకారులు,యువజన సర్వీసుల శాఖ అధికారి నాగేందర్, సైక్లింగ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య, అసోసియోషన్ అధ్యక్షులు శ్రీనివాసులతో పాటు ఉన్నారు.

## కల్యాణలక్ష్మీ, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**బెజ్జంకి, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తోటపల్లి, వీరాపూర్, బేగంపేట, వడ్లూరు, గూడెం, కల్లేపల్లి, గుండారం గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటించి రూ. 9 లక్షల 144 కల్యాణలక్ష్మీ, రూ.8 లక్షల 16 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి అండగా టిఆర్ఎస్ సర్కారు నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు లింగాల నిర్మల, బోయినిపల్లి నర్సింగరావు, గన్నమనేని అనితరావు, చింతలపల్లి సంజీవరెడ్డి, నలువాల అనిత, దేవరాజ్య శ్రీదారం లక్ష్మీ, చెట్టి లావణ్య, మహిపాల్‌రెడ్డి, కచ్చు రాజయ్య, లక్ష్మణ , తిరుపతి, లక్ష్మారెడ్డి, శేఖర్‌బాబు, బోనగిరి శ్రీనివాస్, దీటీ రాజు, బిగుళ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

**-బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్**



ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

**హుస్నాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హుస్నాబాద్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని బిజెవైఎం పట్టణ అధ్యక్షుడు బొప్పిశెట్టి భీమేశ్వర్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని, ప్రభుత్వం వెంటనే నియామకాలు చేపట్టకపోతే బిజెవైఎం ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఉద్యోగాల నియామకాలతో పాటు రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ బృతిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కోశాధికారి, హుస్నాబాద్ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, నాయకులు బొమ్మగాని సతీష్, జనగామ వేణుగోపాల్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, అక్కన్నపేట మండల అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి, కొయ్యడ కార్తీక్, ఎగ్గోజు రాజు, ఆశాడపు శ్రీనివాస్, సాయి, హరికృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యుఐ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కపిల్

**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** ఎన్ఎస్‌యుఐ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని శుక్రవారం గజ్వేల్‌లోని విశ్వతేజ, జ్ఞాన సరస్వతి కళాశాలలో రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ ఆదేశాల మేరకు నూతన కమిటీలు వేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి కపిల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కళాశాలల్లో ఎన్ఎస్‌యుఐ కమిటీలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు సంపత్, రాజు, హరీష్, మధు, నరేందర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ వర్కర్లకు ఏకరూప దుస్తులు పంపిణీ

**దుబ్బాక, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సత్ఫలితాలు వస్తాయని డాక్టర్ హేమ్‌రాజ్‌సింగ్ అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రిలో టివిటి ఏజెన్సీ ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్‌కు ఏకరూప దుస్తువులను అందించారు. గ్రామీణప్రాంత నుండి వైద్యం కోసం వచ్చేవారికి సిబ్బంది మెరుగైన సేవలు అందించడం పట్ల టివిటి ఏజెన్సీ ప్రతినిధి శ్రీనివాస్ హర్షం వ్యక్త చేశారు. ఇక్కడి ప్రాంత ప్రజలతో పాటు వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యానికి రావడం హర్షించ దగ్గ విషయమన్నారు. రోగుల పట్ల సిబ్బంది అంకితభావంతో పనిచేయడం ద్వారానే సత్ఫలితాలు రావడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే శానిటైజర్ వర్కర్లకు అందించిన దుస్తులను సద్వినియోగించికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బల్బీర్ సింగ్, డాక్టర్ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నకోడూరులో ప్రారంభమైన పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవాలు

**చిన్నకోడూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో 5 రోజులపాటు నిర్వహించ తలపెట్టిన పెద్దమ్మ-పెద్దిరాజుల కళ్యాణ మహోత్స ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమైనాయి. మొదటి రోజు అలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



పెద్ద దేవాలయలంలో గణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

## షార్ట్‌సర్క్యూట్‌తో రూ.80 వేల సామాగ్రి దగ్ధం

**తొగుట, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వరదరాజుపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉప్పరి స్వామి ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో రూ.80 వేల విలువైన సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో బాధితుడు తీవ్ర అవేదనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో ఆర్ఐ అశోక్, కార్యదర్శి వెంకటలక్ష్మీ సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తెరాస పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

## తెరాస పార్టీలో చేరిక

**సిర్గాపూర్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్ గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు తెరాస పార్టీలో చేరారు. శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు తెరాస పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెరాస వాసర్ గ్రామ పార్టీ అధ్యక్షులు దేవేందర్ ఆధ్వర్యంలో తెరాస తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెరాస పార్టీ కండువా కప్పి వారికి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు ఏసప్ప, మనోహర్, దేవిదాస్, సుభాష్, ఏశప్ప, శంకర్, గౌస్‌మియా, జగదేవ్, నవిన్, పండరి, నందకుమార్, ఏక్‌నాథ్, ఏవన్, సంజీవ్, రాజు తదితరులు తెరాస తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, తెరాస యువ నాయకులు మహరెడ్డి రోషన్‌రెడ్డి, ఎంపీటీసీ తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలి

**కంది, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంది గ్రామంలోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని కుల సంఘాల నాయకులు తీర్మానించుకున్నారు. శుక్రవారం గ్రామంలో కుల సంఘాల నాయకులు సమావేశమై ఈ నెల6వ తారీఖున అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహం ఏర్పాటుకు చర్చలు జరపాలని తీర్మానించినట్లు అంబేద్కర్ టార్చ్ కమిటి అధ్యక్షులు బి మల్లేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న సాయి, సాయిరాం, సిహెచ్ మహేందర్, పద్మారావు, శంకరయ్య, ఖాజా, ఆనంద్‌రావు, నాగరాజ్, సత్తిగౌడ్, రాజు, ధానయ్య, హరికృష్ణ,గపి, ప్రవీన్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి వెంకటేశం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 2, ప్రభాతవార్త:** పీఎం కిసాన్‌లో డబ్బులు అందుకునేందుకు రైతులు ఈకేవైసిని విధిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తాపూర్, శాపూర్ గ్రామాల్లో ఈకేవైసి నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎం కిసాన్‌లో రైతులు లబ్ధిపొందేందుకు తప్పనిసరిగా ఈకేవైసిని నమోదు చేసుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఇఒలు మహిపాల్‌నర నగేష్, రైతులు పాల్గొన్నారు.

## తెరాస పార్టీకి బాపు మల్‌రెడ్డి రాజీనామా



మాట్లాడుతున్న బాపు మల్‌శెట్టి

**నారాయణఖేడ్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** తెలంగాణ ఉద్యమానికి సహకరించి తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుకై 2001 నుంచి నేటి వరకు పార్టీ కార్యక్రమాల్లో ఎంతో కష్టపడి పనిచేసిన బాపు మల్‌శెట్టి తెరాస పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఖేడ్‌లో సాయి బాబా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ కారుల సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీలో ఒక ఉద్యమకారునికి కూడా తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. తెరాస పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తెరాస పార్టీకి రాజీనామాను చేస్తూ రాజీనామ పత్రాన్ని జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్‌కు పంపారు. తెరాస పార్టీని విడి ఐక్యవేదిక ద్వారా ముందుకు సాగుతామని ఆయన అన్నారు.

## ప్రతిష్ఠా మహోత్సవానికి ఎల్లమ్మ ఆలయం ముస్తాబు

### నేటి నుండి ఎల్లమ్మదేవి ప్రతిష్ఠా కార్యక్రమాలు



ముస్తాబైన ఎల్లమ్మ దేవాలయం

**మర్కుక్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):** మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలకు ముస్తాబైంది. ఈనెల 3వ తేదీ నుండి ఈనెల 6వ తేదీ వరకు ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని స్థానిక సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలకు గ్రామంతో పాటు మండల పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు.

### కార్యక్రమాల వివరాలు

శనివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, రుత్విక్వరణము, అఖండ దీపారాధన, అంకురార్పణము, దేవతాహ్వానం, మండల సంస్కారం, యాగశాల ప్రవేశం, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ, బ్రహ్మాది దేవతాస్థాపన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హవనములు, సాయంత్రం 4 గంటలకు అగ్న్యుత్తరాణము, ప్రతిమాశోధము, జలాధివాసము, సాయం ఔపాసనము, ప్రదోశకాలపూజ, హారతి, మంత్రపుష్పం, రాజోపచారాలు, తీర్థప్రసాద వితరణ, ఆదివారం ఉదయం 8 గంటలకు మార్గశిర ఏకాదశి రోజున ప్రాతఃకాల పూజ, మూలమంత్ర హవనములు, ఉదయం 8 గంటలకు ధాన్యాధివాసము, సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాల పూజ, శయ్యాధివాసము, ఫల, పుష్పాధివాస ములు, సాయం ఔపాసనము, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ, పోచమ్మ, మహంకాళమ్మ, మైసమ్మలకు బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

**ఎక్స్‌ఆర్ ఓపెన్ సోర్స్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌కు మద్దతును అందిస్తున్న మెటా**

ఎక్స్‌ఆర్ సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో భారతదేశం సహకారాని వేగవంతం చేయాలనే దాని నిబద్ధతపై ఆధారపడి మెటా ఎక్స్‌ఆర్ ఓపెన్ సోర్స్‌పై ఫెలోషిప్ ప్రోగ్రామ్ కోసం 1 మిలియన్ డాలర్‌తో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి మద్దతునిస్తుంది. ఈ సందర్భంగా మెటా గ్లోబల్ అఫైర్స్ ప్రెసిడెంట్ నిక్‌క్లెగ్ మాట్లాడుతూ మెటావర్స్ ఒక్క కంపెనీ ద్వారా నిర్మించబడదన్నారు. ఎక్స్ ఆర్ ఓపెన్ వంటి ప్రోగ్రామ్‌ల ద్వారా ఈ ఉత్తేజకరమైన సాంకేతికతలపై పనిచేసే భారతీయ డెవలపర్‌లకు తాము మద్దతు ఇస్తామన్నారు.

## పరిశ్రమల్లో స్థానికులకు అవకాశం కల్పించాలి

### -టిజేఎస్ నాయకులు ఆశప్ప

**జహీరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** స్థానిక పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని టిజేఎస్ నియోజకవర్గ నాయకులు మొగుడంపల్లి ఆశప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కేఫ్ ఎత్నిక్ హోటల్‌లో టిజేఎస్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆశప్ప మాట్లాడుతూ స్థానిక కర్మాగారాల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా స్థానికేతరులకు అవకాశం కల్పించడం సరైందికాదన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగుల పరిస్థితి ఇలా ఉంటే రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని వాపో యారు. నియోజకవర్గ రైతులు చెరుకు పంటను ప్రధానంగా పండిస్తుంటారని, చెరువు రైతుల బాధలు, అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక చెరుకు రైతులు తాము పండించిన చెరుకును ఇతర ప్రాంతాల్లోని కర్మాగారాలకు తరలించి అక్కడ పర్మిట్‌లో కోసం కర్మాగారం ముందు రోజుల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

**దశల వారిగా దీక్షలు...**

ఈ నెల 15 తారీఖున పట్టణ శివారులోని మహీంద్రా పరిశ్రమ ముందు దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. 19న ఆరోగ్య గోవింద్‌పూర్ పరిశ్రమ ముందు దీక్షా చేస్తానన్నారు. 22న అవంతి పరిశ్రమ ముందు తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని దీక్ష చేసేందుకు నిర్ణయించామన్నారు. 28న జహీరాబాదన ప్రాంతీయ లేబర్ కమీషనర్ కార్యాలయం ముందు స్థానిక నిరుద్యోగులతో కలిసి దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజ్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, టీజేఎస్ జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు లక్ష్మణ్, హలీం, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, ప్రేమ్‌కుమార్, ఆయా మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన టిజేఎస్ నాయకులు మొగుడంపల్లి ఆశప్ప



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

## అనర్హులకు డబుల్ బుడ్‌రూం ఇళ్లు ఇవ్వడం సరికాదు

**కంది, డిసెంబరు 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంది గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించడం సరికాదని, అనర్హులకు కేటాయించిన ఇండ్లను రద్దుచేసి స్థానికులైన అర్హులకు కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం మండల కేంద్రమైన కందిలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ దినేష్‌రెడ్డికి పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు ఎంఏ ఖాజా మాట్లాడుతూ గ్రామంలో పేదలు ఉండగా వారికి ఇండ్ల కేటాయించకుండా స్థానికేతరులకు ఇండ్లు కేటాయించం ఏమిటని ఆయాన ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన స్థానికులకు ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.నాయకులు దీపక్‌కుమార్, సంగమేశ్, శివకుమార్, శ్రీనివాస్, రాములు, క్రిష్ణ, నర్సింలు, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## తెరాస సీనియర్ నాయకుడు మృతి

### శోకసంద్రంలో మల్లారెడ్డిపేట



అంతిమయాత్రలో బస్వరాజు పాడే మోస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**మునిపల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** చిరునవ్వుతో అందరిని అప్యాయంగా పలకరించే నాయికోటి బస్వరాజు ఇక లేదని తెలిసి తెరాస పార్టీ మఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు దిగ్భ్రాంతికి గురైనారు. మునిపల్లి మండల మల్లారెడ్డిపేట గ్రామ సర్పంచ్ శివజ్యోతి భర్త బస్వరాజు (52), గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సదాశివపేట నుండి మల్లారెడ్డిపేటకు వెళ్తుండగా బొబ్బిలిగామ పరిసర ప్రాంతంలో రోడ్డు ప్రమాధానికి గురై అకాల మరణం చెందాడు. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ దిగ్భ్రాంతికి గురైనారు. శుక్రవారం నాడు ఎమ్మెల్యే మల్లారెడ్డిపేట గ్రామానికి వచ్చి, మృతుడు నాయికోటి బాస్వరాజు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి భార్య సర్పంచ్ శివజ్యోతిని పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో బస్వరాజు పాడేను మోశారు. మంచి మిత్రుడిని కోల్పోయానని మునిపల్లి మండల తెరాస ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్ ఆవేధన వ్యక్తం చేశారు. ఈ అంతిమ యాత్రకు ఎంపీపీ గౌడిగామ శైలజశివశంకర్, జెడ్పిటీసీ పైతర మీనాక్షిసాయికుమార్, తెరాస పార్టీ మండల అధ్యక్షులు వారణాసి సతీష్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి శశికుమార్, తెరాస యూత్ అధ్యక్షులు ఆనంద్, తెరాస ముఖ్యనాయకులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**కొండాపూర్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** కొండాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తేర్పోల్, చేర్ల గోపులారం, మల్లేపల్లి, గొల్లపల్లి, ప్రతి గ్రామంలో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు శుక్రవారం తెలంగాణ చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణ రాష్ట్రంలోనే ప్రజలకు దక్కుతున్నయన్నారు. గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్డు డ్రైనేజీ తాగునీటి సమస్య లేకుండా ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి, జెడ్పిటీసీ పద్మావతి పాండురంగం, ప్రకాష్, సర్పంచ్‌లు మౌనిక, రుక్మొద్దిన్, శివలీల, మమతవిష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు గీతమోహన్ గౌడ్, సొసైటీ చైర్మన్ ఎల్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు విజయ్, విజయ్ భాస్కర్‌రెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నర్సింలు, నర్సింహరెడ్డి, ప్రేమనందం, రామచంద్రయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : కార్పొరేటర్

**రామచంద్రాపురం, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ ఎంఎంటిఎస్ దగ్గర జీహెచ్ఎంసీ, రాంకీ ఆధ్వర్యంలో శానిటేషన్ డ్రైవ్‌ను శుక్రవారం భారతీనగర్ కార్పొరేటర్ వి సింధుఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మ్యాక్ సొసైటీ ఎంఎంటిఎస్ వద్ద ఉన్న భేల్ స్థలం వద్ద గత కొంతకాలం నుంచి చెత్తచదారం పేరుకుపోయిందని అన్నారు. కొంతకాలంగా భేల్ సంస్థ పారిశుద్ధ్య పనులు, మేయింటెనెన్స్ చూడటం లేదని, దీంతో ఈ ప్రాంతం నుంచి నిత్యం సోషల్ మీడియా, ట్విట్టర్ లో స్వయంగా స్థానికులు ఫిర్యాదులు చేయడంతో బీహెచ్ఈఎల్ అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో ప్రత్యేక చొరవతో రాంకీ, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని అన్నారు. మ్యాక్ సొసైటీ కాలనీ వాసులు, ఫ్రంట్‌లైన్ వారియర్స్ వారికి ఇచ్చిన మాట ప్రకారం రెండు టిప్పర్లు, జేసిబి బాబ్‌కట్‌తో శుభ్రం చేయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రాంకీ రావు వెంటనే స్పందించి క్లీన్ చేయిస్తున్నందుకు కార్పొరేటర్ హర్షం వ్యక్తం చేశారు. రాంకీ జోనల్ ఇంఛార్జి వేణు, సర్కిల్ ఇంఛార్జి సుమన్, జీహెచ్ఎంసీ సూపర్వైజర్లు జిలానీ, జ్యోతి, ఫ్రంట్ లైన్ వారియర్స్ టీం సలీం, హుస్సేన్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

## ఎయిడ్స్‌కు దూరంగా ఉందాం-ఆరోగ్యంగా జీవిద్దాం

### -జిల్లా న్యాయమూర్తి హన్మంత్‌రావు

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** ఎయిడ్స్ వ్యాధికి గురికాకుండా తమ వంతు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యంగా జీవనం సాగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంత్‌రావు అన్నారు. ఏయిడ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవరం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జిల్లా ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సదస్సులో హన్మంత్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎయిడ్స్ వ్యాధికి గురైన వారు భయపడాల్సిన అవసరం లేదని, వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడరాదన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు సహాయ సహకారాలు అవసరమైతే సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు నిర్వహించిన అవగాహన సదస్సులో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రిదేవి, జిల్లా ఎయిడ్స్ శాఖ అధికారి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టిఆర్ఎస్‌ను వీడను-బద్మాష్ బిజెపిలో చేరను

### -విలేఖరులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** తుది శ్వాస వరకు టిఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని, బద్మాష్ భారతీయ జనతా పార్టీలో చేరేది లేదని జహీరాబాద్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను బిజెపిలోకి మారుతున్నట్లు ఓ పత్రిక (వార్త కాదు) కథనాన్ని ప్రచురించడం నిరాధారమైనదన్నారు. బిజెపి బద్మాష్, జూట పార్టీ అని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. తనకు టిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రెండు పర్యాయాలు అవకాశం ఇచ్చారని, అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్న టిఆర్ఎస్‌ను వదిలి జూట పార్టీలోకి ఎలా వెళతానని తప్పుడు వార్త ప్రచురించిన పత్రిక యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో కొనసాగుతున్న అభివృద్ధి బిజెపి పాలిత రాష్ట్రాల్లో కొనసాగడం లేదని విచారం వ్యక్తం చేశారు. బిజెపి కుట్రపూరత రాజకీయాలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కేంద్రంలోని బిజెపి కుట్రపూరితంగా ప్రలోబాలకు గురిచేస్తోందని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసిఆర్, మంత్రి హరీష్‌రావు సహకారంతో నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

### కంగ్టి డిప్యూటీ తాహసిల్దార్ జుబేర్ హైమద్



రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్న డిప్యూటీ తహసిల్దార్ జుబేర్ హైమద్

**కంగ్టి, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని తడ్కల్, దామరగిద్దా గ్రామాలలో శుక్రవారం నాడు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కంగ్టి డిప్యూటీ తాహసిల్దార్ జుబేర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలు లేని గ్రామాలుగా ఉన్నందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని గ్రామంలో నిర్వహించే సదస్సుకు 30 ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను పరిశీలించిన తరువాత మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. ఆయా గ్రామాలలో ఏమైన భూ సమస్యలు ఉంటే ప్రభుత్వం వాటికి పరిష్కరం చేస్తుందని ఆయా గ్రామాల ప్రజలంతా రెవెన్యూ సదస్సుల్లో ప్రతి ఒక్కరు తప్పకుండా పాల్గొని, వారి వారి సమస్యనలు తమ దృష్టికి తేవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, సర్పంచ్ గడ్డపు మనోహర్, సొసైటీ డైరెక్టర్ హనుమంత్‌రెడ్డి, ఆత్మడైరెక్టర్ దర్జీ రమేష్, ఎంపీటీసీ పొగాకుల శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి జ్ఞాన్‌దేవ్, గ్రామరైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మడిదల మండల కేంద్రంలో..**



మంబాపూర్‌లో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసిల్దార్ సుజాత

**గుమ్మడిదల, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలంలోని మంబాపూర్‌లో రెవెన్యూ సదస్సు శుక్రవారం నాడు తాహసిల్దార్ సుజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతుల నుండి స్పందన వచ్చిందని తెలిపారు. రైతులకు గతంలో పాత పాస్ బుక్కులో నుండి కొత్తపాస్ బుక్‌లో లేని భూముల సమస్యల పరిష్కారం దిశగా గ్రామంలోనే గ్రామపంచాయతీ ఆవరణలో రైతులు నిర్వహించి సమస్యల పరిష్కారం చేశామని, ఇంకా ఏదైనా సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తాహసిల్దార్ సుజాత తెలిపారు. సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్, జెడ్పిటీసీ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ దయానంద్, వార్డు సభ్యులు, రైతులు, అధికారులు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి వలస కూలీలు

**న్యాల్‌కల్, డిసెంబరు 2, ప్రభాతవార్త:** బండెనుక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి అన్నట్లుగా మండలానికి నారాయణఖేడ్ ప్రాంతం నుంచి వలస కూలీలు మండలానికి చేరుకుంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 50వేల హెక్టార్లలో రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. పత్తి, చెరుకు పంటలను మండలంలో ప్రధానంగా సాగు చేస్తున్నారు. పత్తిని ఏరేందుకు, చెరుకును నరికేందుకు మండలంలో కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఖేడ్ ప్రాంతంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ ప్రాంతం నుంచి కూలీలను రప్పించుకుని వ్యవసాయ పనులు చేయించుకుంటున్నారు. వలస వచ్చిన కూలీలు తమ పిల్లా పాపలతో రావాల్సి ఉండటంతో చిన్నారుల సదువులు సంకనాకి పోతున్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని హద్నూర్, మెటల్‌కుంట, మిర్జాపూర్, గంగ్వార్ తదితర గ్రామాల్లో వలస వచ్చిన కూలీలు తాత్కాలిక గుడిసెలు వేసుకుని కూలీ పనులు చేసుకుంటున్నారు.



ఎస్టీవో నుంచి ఆదాయపన్ను వివరాలు స్వీకరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

## విశ్రాంత ఉద్యోగులకు అందుబాటులో ఆదాయపన్ను వివరాలు

**జోగిపేట, డిసెంబర్ 02, ప్రభాతార్త:** జోగిపేట ఉప ఖజాన శాఖ పరిధిలోని 280మంది విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి ప్రస్తుత వార్షిక సంవత్సరానికి సంబధించిన ఆదాయ పన్ను వివరాలను జోగిపేట ఎస్టీవో నుంచి స్వీకరించి సంఘ కార్యాలయం నందు అందుబాటులో ఉంచామని అందోలు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ తెలిపారు. ఈ వివరాలను విశ్రాంత ఉద్యోగులు సంఘం భవనంలో ఉండే బాధ్యులనుంచి తెలుసుకోవచ్చని, ఎవరైనా పన్ను పరిధిలోని వచ్చి ఉండి అందుకు సంబంధించిన మినహాయింపు ధ్రువపత్రాలు కలిగి ఉంటే, వాటిని ఎస్టీవోకు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాద్యులు పి.నవీన్‌కుమార్‌గౌడ్, జనార్ధన్, మండల కార్యవర్గసభ్యులు టి.రాజయ్య,సదాశివగౌడ్, వీరేశం, వెంకటేశం, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉపకరించేలా గెస్ట్ లెక్చర్స్

**జోగిపేట, డిసెంబర్ 02, ప్రభాతార్త:** విద్యార్థులకు ఉపకరించేందుకోసమే గెస్ట్ లెక్చర్స్ ఇప్పిస్తున్నామని, అందులో భాగంగానే వృక్షశాస్త్ర విభాగంలో డిగ్రీ విద్యార్థులకు శుక్రవారంనాడు గెస్ట్ లెక్చరర్‌తో ఉపన్యాసం ఇప్పించటం జరిగిందని జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అడవిరాజు తెలిపారు. కళాశాలకు చెందిన వృక్షశాస్త్ర విభాగం లెక్చరర్లు లలిత, శైలజల ఆధ్వర్యంలో సదాశివపేట డిగ్రీ కళాశాలకు చెందిన వృక్షశాస్త్ర విభాగం లెక్చరర్ కె.అనురాధతో పక్సినియో జీవిత చరిత్రపై ఉపన్యాసం ఇప్పించారు. అకడమిక్ కోఆర్డినేటర్ ఏ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 10 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన పేదలు కార్పోరేట్ ఆస్పత్రులలో మెరుగైన వైద్యం అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం జహీరాబాద్, మొగుడంపల్లి మండ లాల్లోని ఆయా గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు 3లక్షల 4వేల రూపాయల చెక్కులను అందచేశారు. ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు యాదవ్, నర్సింలు యాదవ్, మాజీ జడ్పీటిసి సభ్యులు మాణెమ్మ, నాయకులు తు, ఇజ్రాయిల్ బాబి, సత్యం ముదిరాజ, సర్పంచులు ఫర్వేజ్, కేశు, ఎంపిటిసి సభ్యులు హైదర్ పటేల్, హబ్బి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత



ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు శాలువకప్పి సన్మానిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

**రేగోడ్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** శుక్రవారం నాడు వట్‌పల్లి మండలం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్వగ్రామమైన పోతులబోగుడ గ్రామం పరిధిలోగల ఆర్ ఇటిక్యాల గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఉప్పరి ఆంజనేయులు తమ్ముడు ఉప్పరి అశోక్ గత కొన్ని రోజులు క్రితం ప్రమాదావశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. అతనికి టిఆర్ఎస్ పార్టీ క్రియశీలక సభ్యత్వం ఉన్నందున మృతుడు ఆంజనేయులు కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల ప్రమాద భీమా చెక్కును ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేగోడ్ మండల ప్రధాన కార్యదర్శి సుంకె రమేష్, పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, నాయకులు లింగయ్య, రాజు నాయక్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## బాబుల్‌గావ్ గ్రామాన్ని పరిశీలించిన డిఏఓ

**కంగ్టి, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని బాబుల్‌గావ్ గ్రామానికి శుక్రవారం నాడు జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు (డిఏఓ) క్షేత్ర పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా గ్రామంలోని చెరుకు, వేరుశనగ పంటలను పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో రైతులకు సలహాలు, సూచనలు చూస్తూ రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేసుకొని, అధికలాభాలు పొందాలని ఆయన అన్నారు. అదే విధంగా మండలంలోని రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ పై సమావేశం నిర్వహించి, రైతులు, ప్రజలందరూ తప్పకుండా ఈకెవైసిని గడువు సమయంలోగా దరఖాస్తుచేసుకోవాలని, పీఎం కిసాన్ నిధి పొందాలని రైతులకు డిఏఓ నర్సింహరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఓ ప్రవీణ్ చారి, ఏఈఓ గాండ్ల సంతోష్ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన సంక్షేమ సంఘం నూతన కమిటీ



మహిపాల్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

**గుమ్మడిదల, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్డి సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, అధ్యక్షులు జగ్గారెడ్డి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సరెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, పోచుగారి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామక్కపేట ప్రదీప్‌రెడ్డి, ట్రెజరర్ అమ్మగారి రవీందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బుచ్చగారి రాంరెడ్డి సభ్యులుగా పడమటి నరేందర్‌రెడ్డి, పోచగారి రవీందర్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాసరెడ్డి, కమటం సుధాకర్‌రెడ్డి, బుచ్చగారి బాల్‌రెడ్డి, కవ్వం రవీందర్‌రెడ్డి, కమటం జైపాల్‌రెడ్డి, ముత్యాల రంగారెడ్డి, సరెడ్డిగారి కరుణాకర్‌రెడ్డి, అక్కిరెడ్డి, మహేష్‌రెడ్డి, కాలకంటి శ్రీధర్‌రెడ్డి, రాహుల్‌రెడ్డిలను సభ్యులుగా ఎన్నుకుంటూ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

**నేడు సిద్ధనాత్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో కుండలిని క్రియా యోగాదీక్షలు**

బేగంపేటలో హోటల్ మనోహర్‌లో నేడు సిద్ధనాథ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో కుండలిని క్రియా యోగా దీక్షలు సాధికారత సెషన్ నిర్వహించనున్నారు. ఇందులో యోగిరాజ్ తన అనుభవాన్ని అందించనున్నారు. కుండలిని క్రియా యోగ అనేది పురాతన కాలం నుంచి ఆచరించే ఒక ప్రత్యేక ధ్యాన పద్ధతి. ఈ ప్రత్యేక ధ్యాన సాధన మన దైనందిన జీవితంలో సౌలభ్యం, క్రమాన్ని తెస్తుంది. ఆధ్యాతిక పరిణామాన్ని వేగవంతం చేస్తుంది.క్రమమైన నిరంతర అభ్యాసం అన్ని స్థాయిల్లో అభ్యాసకుడిని స్పష్టపరుస్తుంది.